క్లుప్తంగా

అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన ఎం కీర్తి అనే వృక్షశాస్త్ర అధ్యాపకురాలు పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ఓయూ సైన్స్ కళాశాల బోటనీ విభాగంలో ప్రొఫెసర్ సబితారాణి పర్యవేక్షణలో 'ఇన్విట్రో కల్చర్ అండ్ ఫైటో కెమికల్ ప్రొఫైలింగ్ ఆఫ్ ఓ ఫర్మ్యాలిన టార్వెతం(ఎల్)సిల్వమాన్ సో' అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు.

వన నర్సరీ పరిశీలన



నిజాంసాగర్ (జుక్కల్): మండలంలోని జక్కాపూర్ గ్రామ నర్సరీని గురువారం స్థానిక ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. నర్సరీలోని చెట్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అయన వెంట పంచాయతి కార్యదర్శి సీహెచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

నియామకం



బొడ్ల రాజు

పిట్లం(జుక్కల్) : జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా పిట్లంకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాకుడు బొడ్లరాజు నియమించినట్లు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పోతాయిపల్లిలో గురువారం స్థానిక పెద్దమ్మ ఆలయం వద్ద అజయ్ హాస్పటల్ లింగంపేట వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘ అధ్యక్షుడిగా బద్రి స్వామి



రాజంపేట : రాజంపేట పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం నూతన రజక సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్రి స్వామి, ఉపాధ్యక్షులుగా గడ్డమీది యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా చల్లగారిగే నారాయణ, సహాయ కార్యదర్శులుగా తలమడ్ల సత్యనారాయణ, బక్కోల బాబు, కోశాధికారిగా తలమడ్ల భూమయ్య ఎనికయ్యారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌కు శిక్షణ

కామారెడ్డి టౌన్ : ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు ఏనుగు అనిల్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్ ఉంటుందని, ఏప్రిల్ 11వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 9392439573, 9701211819లో సంప్రదించాలన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

బాన్సువాడ రూరల్ : తెలంగాణ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెంటనే పరీక్ష హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కొత్తాబాది మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫకీరయ్య తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 7న ఉదయం 10 గంటల నుంచి పరీక్ష ఉంటుందన్నారు. 7, 8, 9, 10 తరగతుల్లో మిగులు సీట్ల కోసం అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులో నడుస్తున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరుగుతున్న పనులు నాణ్యతగా జరుగాలని సూచించారు. ఆయన వెంట ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, కూలీలు ఉన్నారు.

దడ పుట్టిస్తున్న విద్యుత్ తీగలు

- ఒడ్డెర కాలనీలో తక్కువ ఎత్తులో వేలాడుతూ..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు





ఒడ్డెర కాలనీలో చేతికి అందేలా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతులకు అందేలా, ఇంటిపై నుంచి తీగలు వెళ్లిన, తండాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్న పట్టించుకునే నాథుడు లేరని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

ఒడ్డెర కాలనీలో..

ఎల్లారెడ్డి పట్టణంలోని ఒడ్డెర కాలనీలో విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండగా, కాలనీలోని గౌస్ అనే వ్యక్తి ఇంటి పై నుంచి విద్యుత్ తీగలు వెళ్లడంతో ఇంటి పైకి వెళ్లాలంటేనే భయం వేస్తోందని బాధితుడు ఆందోళన చెందుతున్నాడు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ తీగల సమస్య ఉండడంతో కాలనీకి విద్యుత్ స్తంభాలను తీసుకువస్తే వాటిని ఇతర ప్రాంతాలకు తరలించారని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒడ్డెర కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని కాలనీ వాసులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

ఇంటిపైకి వెళ్లాలంటే భయం



ఇంటిపై నుంచి విద్యుత్ తీగలు వెళ్లడంతో ఇబ్బందిగా ఉంది. ఇంటి పైకి వెళ్లాలంటేనే భయం వేస్తోంది. వర్షం కురిస్తే మరింత భయంగా ఉంటుంది. ఇంటి పై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను పక్కకు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్ని మార్లు కోరినా వారు పట్టించుకోవడం లేదు.

– గౌస్, ఒడ్డెర కాలనీ, ఎల్లారెడ్డి

చేతికి అందేలా ఉన్నాయి



ఒడ్డెర కాలనీలో చేతికి అందేలా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ శాఖ అధికారులు వేలాడుతున్న విద్యుత్ తీగల మధ్య కొత్తగా స్తంభాలను వేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మల్లయ్య, ఒడ్డెర కాలనీ, ఎల్లారెడ్డి

షిఫ్టింగ్ చార్జీలు భరించాలి

పట్టణంలోని ఒడ్డెర కాలనీలో వేళాడే విద్యుత్ తీగల మధ్య అదనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి షిఫ్టింగ్ చార్జీలను కాలనీవాసులు భరించాల్సి ఉంటుంది. ఎస్టిమేషన్ వేసిన తర్వాత చార్జీలను చెల్లిస్తే స్తంభాలను తొలగిస్తాం.

– సత్యనారాయణ, ఏఈ ట్రాన్స్‌కో, ఎల్లారెడ్డి

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శరత్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐఏఎస్, జిల్లా ప్రత్యేకాధికారి శరత్ సూచించారు. గురువారం మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గల మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. భగీరథ ప్లాంట్ నుంచి గ్రామాలకు భగీరథ నీరు సరఫరా అయ్యే తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, గ్రిడ్ ఈఈ నరేశ్‌బాబు, డీఈ అమీర్‌ఖాన్, ప్రవీణ్‌రెడ్డి, ఏఈ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణం తీసుకుంటే తిప్పలే..

- రైతు అకౌంట్ ఫ్రీజ్ చేసిన బ్యాంక్ అధికారులు
- కిస్తీకి సరిపడా డబ్బులు ఉన్నా తప్పని ఇబ్బంది



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో రుణం తీసుకున్న రైతుకు బ్యాంకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. రైతు అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి ముప్పుతిప్పలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన పెంటాపురం రాజలింగం అనే రైతు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో 2019లో తన ఇంటి డాక్యుమెంట్లు పెట్టి రూ. 5లక్షల రుణం తీసుకున్నారు. నెలకు రూ. 8,900 చొప్పున ఇప్పటిదాకా 54 నెలలు కిస్తీలు కట్టాడు. ఈ క్రమంలో రాజలింగం భార్య క్యాన్సర్‌వ్యాధికి గురికాగా మూడు నెలలు ఆస్పత్రుల చుట్టూ తిరగడంతో కిస్తీలు కట్టలేదు. చివరికి రాజలింగం భార్య మృతిచెందింది. అనంతరం మూడు నెలల వాయిదాల డబ్బులతో పాటు మరికొంత మొత్తం రూ. 68 వేలను ఖాతాలో వేయగా బ్యాంక్ అధికారులు అకౌంట్‌ను వెంటనే ఫ్రీజ్ చేశారు. ఎందుకు ఫ్రీజ్ చేశారని ప్రశ్నిస్తే రూ. 68వేలు కాకుండా మరో రూ. 12వేలు కట్టాలని పొంతన లేని సమాధానం చెబుతున్నారని బాధితుడు రాజలింగం వాపోయాడు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించగా తాను ఇటీవలే మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టానని సదరు ఫిర్యాదుపై త్వరలోనే విచారణ చేస్తామని పేర్కొన్నారు. సరిపడినన్ని డబ్బులు అకౌంట్‌లో ఉన్నప్పటికీ బ్యాంక్ అధికారులు తన అకౌంట్‌ను ఫ్రీజ్ చేయడమేమిటని బాధితులు లబోదిబోమంటున్నాడు.

చలి వేంద్రం ప్రారంభం



మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు ఖాసీంఖాన్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నౌసిలాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్ నాయక్, అలీఖాన్, బన్సిలాల్, సంజు నాయక్ తదితరులున్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



బాన్సువాడ : బీర్కూర్‌లో ఉపాధి హామీ కూలీలకు గురువారం వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకే కూలీలు పనులు చేయాలని, ఎండల్లో బయట ఉండవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి





సదాశివనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో కవిత, చిన్నకొడప్‌గల్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో కవిత పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని విండో కార్యాలయం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విండో సీఈవో విఘ్నేశ్‌గౌడ్, విండో సిబ్బంది బాల్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్) : మండలంలోని చిన్నకొడప్‌గల్, బుర్గుపూర్, కాటేపల్లి గ్రామాలలో సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చిన్నకొడప్‌గల్ సహకార సంఘం సీఈవో హన్మాండ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో సురేష్, సహకార సంఘం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సింధే, అనిల్‌కుమార్

బిచ్కుంద(జుక్కల్) : బీఆర్ఎస్ హయాంలో ముస్లింలకు అన్ని రకాల సదుపాయాలు సమకూర్చామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను చిన్నచూపు చూస్తోందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. గురువారం బిచ్కుందలో మున్నూరు కాపు సంఘంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీ అశోక్, నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, రాజు, అసద్‌అలీ, కలీం పటేల్, అన్వర్ తదితరులున్నారు.

సమాచారం..

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరడానికి ఈనెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు ఉదయం 10 గంటలకు, 7–10వ తరగతుల్లో చేరేందుకు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సదాశివనగర్ మండలంతో పాటు రామారెడ్డి మండలానికి చెందిన విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షలు రాయడానికి అర్హులని పేర్కొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలపై ఆగ్రహం

- తాడ్వాయి మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల నిలదీత



మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో తాగునీరు, కరెంటు సమస్యలు లేకుండా చూడాలని ఎంపీటీసీలు కోరారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కొడి రవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి రాక పోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులను సరిగ్గా నింపడం లేదని, నీళ్లు అన్ని ఇళ్లకు సరఫరా కావట్లేదని ఎంపీటీసీలు ఆగ్రహించారు. విద్యుత్‌సమస్యలపై సిబ్బంది పట్టించుకోవట్లేదని ఎంపీటీసీలు టాన్స్‌కో అధికారులను నిలదీశారు. త్వరలోనే పెండింగ్‌పనులను పూర్తిచేస్తామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. మండలంలో కూలీలపై వైఎస్ ఎంపీపీ నర్సింలు ఆరాతీయగా 1400 మంది ఉన్నారని ఏపీవో స్మృతి పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 1గంటలకు ప్రారంభమైంది. మండలంలో 13,300 రేషన్ కార్డులు ఉన్నాయని కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని తమకు ఎలాంటి ఆదేశాలు లేవని తహసీల్దార్ రహీమొద్దీన్ పేర్కొన్నారు. రేషన్‌కార్డులు లేకున్నా కల్యాణలక్ష్మికి అర్హులను గుర్తించాలని ఎంపీటీసీ జలందర్ కోరారు. తాగునీటి సమస్యలు మా దృష్టికి వస్తే పరిష్కరిస్తామని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. మండల కోఆప్షన్ మెంబర్ ఇంతియాజ్ అనారోగ్యంతో మృతి చెందడంతో సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రవి, వైస్‌ఎంపీపీ నర్సింలు, సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, ఎంపీడీవో సాజిద్ అలీ, తహసీల్దార్ రహీమొద్దీన్, ఏవో శ్రీకాంత్ తదితరులున్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



బాన్సువాడ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు అన్నారు. గురువారం బాన్సువాడలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏఐటీయూసీ పోరాటం చేస్తోందని అన్నారు. కార్మికులకు ప్రసూతి సహాయం, వివాహ కానుక, సహజ మరణంకు ఆర్థిక సాయం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సురేశ్, గంగాధర్, మతీన్, రాము, సాయిబాబా, భాగ్య, నాగబాయి తదితరులు ఉన్నారు.

పదేళ్లుగా అభివృద్ధి శూన్యం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎంపీ బీబీ పాటిల్ ఊసరవెల్లిలా రంగులు మారుస్తాడని, పదేళ్లుగా ఆయన ఎంపీగా ఉన్నా అభివృద్ధి శూన్యమని నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగిరెడ్డిపేటకు కనీసం ఒక్క అంబులెన్సు ఇవ్వని నాయకుడు బీబీపాటిల్ అని అన్నారు. కరోనా సమయంలో ఆదుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో డిసిప్లేన్ కమిటి చైర్మెన్లు రాంచందర్‌రెడ్డి, బోయిని విఠల్, కార్యదర్శి కిష్టయ్య, ఉపాధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ముస్తాబైన ప్రభుస్వామి ఆలయం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయం మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేసి ఆలయాన్ని పూలతో అలంకరించారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయం వద్ద జాతర నిర్వహిస్తారు. అలాగే మొదటి రోజు ఎడ్ల బండ్ల ప్రదర్శన, రెండవ రోజు రథోత్సవం, మూడవ రోజు ముగింపు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తాగునీరు, భక్తులకు వసతి ఏర్పాటు చేసినట్లు కమిటీ నిర్వాహకులు శంకరప్ప తెలిపారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం



బాన్సువాడ : పట్టణంలోని గౌలీగూడ హనుమాన్ మందిరం నిర్మాణానికి గౌలీగూడకు చెందిన హజరే కిషన్‌రావు–గంగాబాయి కుటుంబ సభ్యులు రూ. 1,11,116 లక్షల విరాళం అందజేశారు. కాలనీకి చెందిన హజరే కిషన్ రావు కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు, హజరే కుటుంబ సభ్యులు బసంత్, శంకర్, దండొభ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల విగ్రహాలను స్టేజీపై ఉంచి పట్టువస్త్రాలు కట్టించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన పల్లకీ సేవ నిర్వహించారు. విగ్రహాలను జాతీయ రహదారి వద్ద నంది విగ్రహం వరకు ఊరేగించారు. రథోత్సవం నిర్వహించారు. యువకులు రథాన్ని పోటా పోటీగా లాగారు. ఈ కార్యక్రమంలో వేదబ్రాహ్మణులు రామకృష్ణశర్మ, సంతోష్‌కృష్ణ శర్మ హరికృష్ణ శర్మ, శివ శర్మ,ఆలయ కమిటీ చైర్మన్ జోగిని రాజయ్య, కార్యదర్శి నడ్పి గంగయ్య, కోశాధికారి బద్దం రాజిరెడ్డి, కమిటీ ప్రతినిధులు లచ్చిరెడ్డి, సాయిరెడ్డి, కుమ్మరి రాజయ్య తదితరులున్నారు.

సాయి ఆలయంలో అన్నదానం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న షిర్డీ సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా సాయి నాథునికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఖాగడ హారతి అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు.

బాలహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డి : మండలంలోని భిక్కనూరు గ్రామంలో గురువారం బాల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం విగ్రహానికి జలాధివాసంలో ఉంచారు. మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కొల్లూర్‌లో ఘనంగా జాతర



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొల్లూర్ గ్రామంలో గురువారం గ్రామ దేవతల పండుగ సందర్భంగా జాతర మహోత్సవం నిర్వహించారు. గ్రామ దేవతల గుడుల చుట్టూ ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవార్లకు గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. చుట్టుపక్కల గ్రామాల మల్లయోధులు పోటీల్లో పాల్గొని నగదు బహుమతులు అందుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రం సమీపంలోని పొల్కంపేట చౌరస్తాలో ఉన్న అమృత కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కర్, ఎల్లారెడ్డి శాసన సభ్యుడు మదన్‌మోహన్ రావు హాజరవుతున్నట్లు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని పలువురి అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ భూంగారి రాము తండ్రి వెంకటేశం మృతి చెందగా అతడి అంత్యక్రియలకు హాజరైన అనంతరం, మండలంలోని వెల్లుట్ల ఎంపీటీసీ లక్ష్మీ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నియామకం నిలిపివేత

బాన్సువాడ : జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నియామకంను నిలిపివేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. బాన్సువాడకు చెందిన పాత బాలకృష్ణకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు జిల్లా కమిటీ ప్రకటించిన నేపథ్యంలో స్థానికంగా ఉండే సీనియర్ కాంగ్రెస్ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికార నియామకాన్ని నిలిపివేస్తునట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

పుస్తె, మట్టెల వితరణ

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన బట్టు లింగం కుమార్తె వివాహం సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ గురువారం పుస్తె, మట్టెలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, యేసు స్వామి, నర్సింలు, ప్రవీణ్, అఖిల్, ప్రశాంత్, భాను తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రాజంపేట : మండలం తలమడ్ల శివారులో గురువారం ఎస్సై సంపత్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తమ వెంట తీసుక్తే తగిన ఆధారాలు చూపాలని లేకపోతే సీజ్ చేస్తామన్నారు.

అనారోగ్యంతో మండల కోఆప్షన్ మెంబర్ మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన మండల కోఆప్షన్ మెంబర్ ఇంతియాజ్ అనారోగ్యంతో మృతిచెందారు. రెండు పర్యాయాలు పదేళ్లుగా ఆయన మండల కోఆప్షన్ మెంబర్‌గా ఉన్నారు. కిడ్నీలు పాడవడంతో ఆయన మృతిచెందారు.

వెల్లుట్ల ఎంపీటీసీ..



ఎల్లారెడ్డి : మండలంలోని వెల్లుట్ల ఎంపీటీసీ సుతారి లక్ష్మీ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న లక్ష్మీ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. లక్ష్మీ మృతి పట్ల ఎంపీపీ మాధవి, ఎంపీడీవో లక్ష్మీ, ఎంపీవో ప్రకాష్, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.